# పార్వతి

-చావా శివకోటి

సాహితీ సభ

సభలో శ్రీశ్రీ, నార్ల, ఆరుద్ర, విశ్వనాధ లాంటి వారున్నారు.

'నార్ల' మాట్లాడుతూ "శ్రీ విశ్వనాధకు మాకూ భేదాభిప్రాయం (సాహితీపరంగా) ఉన్నప్పటికీ' అని - వారి ధోరణి చెప్పారు. 'విశ్వనాధ గారు ఊర్కోరు' అనుకున్నారు సభానదులు. విశ్వనాధగారి వంతు రానే వచ్చింది. ఆయన మాట్లాడుతూ 'నార్ల' సాహితీ ధోరణులను తడిమి భేదాభిప్రాయాలున్నాయన్నారు. మీరు విన్నారు గదా!' అని నవ్వి - 'నాకు తెల్సిన వరకు స్వతంత్ర అభిప్రాయాలున్న వారికి మాత్రమే భేదాభిప్రాయాలుంటాయి. శ్రీశ్రీ 'మార్పు'ను గురించి చెప్తాడు. నేను ఆదిశంకరులను గురించి చెప్తుంటిని. ఇక్కడ భేదాభిప్రాయానికి ఆస్కారం లేదు. ఉండదు' అనగానే సభ పెద్ద పెట్టున చప్పట్లు చరుస్తూ నవ్వుల జల్లున మునిగింది.

'నార్ల' వారి ముఖాన దరహాసం కనిపించింది.

భ్రమన ఉన్న నిజాలు గనుక.

****

మా ఇంటికి సరిగ్గా రెండిళ్ళ అవతల పార్వతీవాళ్ళ ఇల్లు.

వారిది స్వంత ఇల్లు కాదు. అద్దెకు దిగారు.

పార్వతికి అమ్మ తప్ప నాన్న లేదు.

పల్లెన ఉన్న కొద్దిపాటి పొలంపై వచ్చే 'కౌలు'తో అమ్మా బిడ్డలు కాలం గడుపు తున్నారు.

సంక్రాంతి పండుగ రోజులు.

మా 'ఇంటి' 'ముగ్గు' నిండుకుంది.

అమ్మ. నన్ను. 'ముగ్గు' బదులుకోసం పార్వతివాళ్ళ ఇంటికి పంపింది.

నేను వెళ్ళాను. గుమ్మంలో ముగ్గేస్తూ కనిపించింది పార్వతి.

పిలక జడ.

పెద్ద ఆరిందాన్లా ముగ్గేస్తూ ముఖాన పడే జుత్తును పైకి నెట్టుకుంటూ.. నా వైపు చూసింది.

'అమ్మ' ఉందా?' అడిగాను 'ఆగి'

'ఉంది' అని 'అమ్మా' అని వెనక్కి మళ్ళి పిలిచి తిరిగి ముగ్గు కుదురుగ వేయడంలో నిమగ్నమైంది.

నా వైపు పార్వతి చూసినప్పుడు 'కళ్ళు' చాలా అందంగా అనిపించినయి.

'గోర'గా నాజూకుగా అనిపించింది.

వయస్సు పద్నాలుగేళ్ళు ఉండొచ్చు.

నేనప్పటికి టీచరు ట్రైనింగ్ కెళ్ళి వచ్చాను. 'నౌకరీ' కూడా దొరికింది.

వెళ్లి ఉద్యోగాన చేరాలి.

నేను లోనకు నడిచాను పార్వతినే చూస్తూ.

'ఓ నువ్వటయ్యా! అంటూ పార్వతి తల్లి ఎదురొస్తుంటే 'ముగ్గు' సంగతి చెప్పాను.

'అలాగే' అని ఓ డబ్బాడు ముగ్గు నా చేతనున్న సంచిన పోసింది.

సంచితో వెనక్కి వస్తూ. 'ఏం చదువుతున్నావు?' అని అడిగాను పార్వతి దగ్గర ఆగి.

'పది' అంది నావైపు చూడకుండానే.

తేగలు కొనిపెట్టమనీ - నేరేడు పండ్లు తెంపమనీ... చీమ చింత గుబ్బలు రాల్చమనీ... బాగా మారాం చేసేది. కూర్చుంటే అదాటున వెనకనుంచి వచ్చి గుద్దేది. కాయలు రాల్చినాక ఏరుకొని పరిగెత్తేది. వెంట పడితే దొరికేది కాదు, తూనీగ నయం. నాకు ఒక్కటి కూడా ఇచ్చేది కాదు. పైగా దూరంగా ఉండి ఊరిస్తూ తినేది.

పండుగ అయిపోయింది.

నేను నా ఉద్యోగం దగ్గరకు వెళ్ళిపోయాను.

రెండేళ్ళు గడచిపోయినాయి. నేను సెలవులకు వస్తూ పోతూనే ఉన్నాను.

పార్వతి కనిపిస్తూనే ఉన్నది.

ఒక నాడు నేను బడిన ఉండగా పోస్టుమన్ నాకో కార్డు ఇచ్చాడు.

అమ్మ వ్రాయించిందేమోననుకున్నాను.

కాదు. పార్వతి వాళ్ళ అమ్మ వ్రాయించినది.

పార్వతికి పెళ్ళి కుదిరిందనీ.. వరుడు పశువుల ఆసుపత్రిలో సహాయకుడని, నాలుగు రోజులు పెళ్ళి ఉందనగా రమ్మనీను.

'పార్వతి'కి పెళ్ళా? అనిపించింది.

కార్డు మడిచి జేబున ఉంచుకొని 'తరగతి'లోకి నడిచాను.

ఈ పెళ్ళి మాట నన్ను కొంచెం చికాకు పెట్టింది. కారణం స్ఫురించలేదు.

పార్వతి. కనుముక్కుతీరే గాక 'నడత' మంచిది. ఒద్దికైన పిల్ల.

కనుక ఇంకా మంచి సంబంధం వస్తే బాగుండు అనిపించింది.

వయస్సు రీత్యా నాకు పార్వతికీ – పదేళ్ళు తేడా ఉంది.

ఎందుకోగానీ – పార్వతిలాంటి పిల్ల నాకు ఇల్లాలయితే బాగు' అనుకున్నాను.

'పార్వతి' అయితే? అన్నభావన లోన పొరనే ఉందేమోగానీ బయటకు రాలేదు.

****

ఉన్నవాళ్ళు ఇంకా సంపాదించడంలోనూ

లేని వాళ్ళు 'నిరాశ'ను భరించలేక భక్తిన పడడం మనకు కనిపిస్తున్నదే.

నేను పార్వతి పెళ్ళికి వెళ్ళలేకపోయాను.

'కారణం' కార్డు ద్వారా తెలిపాను. 'పెళ్ళి బాగానే జరిగిందట' అమ్మ తెలిపింది.

అయితే. పార్వతి పెళ్ళి జరిగిన దగ్గర నుంచీ. అమ్మ నన్నుపెళ్ళికి తొందర పెట్టసాగింది. ఆమె అనడమే కాదు. నాకూ 'పెళ్లాడితే బాగు' అనిపించిన సందర్భాలూ ఉన్నాయి. అలా అనిపించినప్పడల్లా. 'పార్వతి' రూపు తలన మెదిలేది.

అందమైన కళ్ళు. నునుపుదేలిన వళ్ళూ. నాజూకు నడుము. ఆకర్షణీయమైన వక్షం. పొందికైన నడక. అమాయకంగా ఉండి ఆరిందాలా చూసే చూపు వగరుగా ఉండే నవ్వు.

'పార్వతి'నే పెళ్ళాడితే పోయేది అని మాత్రం ఎప్పుడూ నా తలన మెదలలేదు.

ఆడపిల్ల అంటే మా పార్వతిలా ఉండాలని మాత్రం అనిపించేది.

ప్రేమ. అభిమానం ఆత్మీయతా అనేవి వినేప్పుడు చాలా పెద్దగా గొప్పగా అనిపిస్తయి. నిజ జీవితాన అవి ఎప్పుడు ఎలా ఎవరికి అన్వయింపబడతాయో మాత్రం అర్థం కాదు

నాకు శెలవలిచ్చారు.

'ఇంటికెళ్తే బాగు' అనిపించింది. అమ్మ గుర్తు కొచ్చింది. ఇక ఆగలేదు.

ప్రొద్దుటే సూర్యోదయాన్ని చూస్తూ, ముఖం పుల్ల కోసం వేప చెట్టేపు నడిచాను.

పార్వతి–కళాపి చల్లుతూ వాళ్ళ ఇంటి ముందు కనిపించింది. అటు నడిచాను . లోగా కంటే నిండుగ కనిపించింది. ఇల్లాలయింది గదా!

నన్ను చూసి. కళాపే చల్లడం ఆపి 'ఎప్పుడొచ్చావు' అనడిగింది.

'రాత్రి, బాగా పొద్దుపోయింది'.

'నిన్ను చాలాదూరం వేశారన్నారు?'

తలూపాను. లోనకు చూస్తూ వాళ్ళాయన కనిపిస్తాడేమోనని. వెతికాను.

నన్ను గమనించి, ఎదయిన గొడ్డు వస్తే – ఆసుపత్రిదాకా వెళ్ళాడు అని

'రా! కాఫీ కలిపిస్తాను' అంది.

మొఖం కడుక్కుని – వస్తాను అని వెళ్ళి పది నిముషాలలో వచ్చాను.

మంచి కాఫీ ఇచ్చింది. వాళ్ళాయన మాత్రం ఇంకా రాలేదు.

'మీ అమ్మేది?' అడిగాను, కాఫీ త్రాగుతూ.

'అమ్మవారి ఆశ్రమాన ఉంటున్నది'

'ఇంటికి రాదా?'

'రావాలనుకున్నప్పుడు వచ్చి పోతుంటుంది' అని 'నీ పెళ్ళెప్పుడు' అనడిగింది. నన్నే చూస్తూ.

'చూస్తున్నాను'.

'ఆడ పిల్లల్నా' అంది నవ్వుతూ

'వాళ్ళే మిమ్మల్ని చూసుకొనే రోజులొస్తున్నాయి' అన్నట్టుందా నవ్వు.

'అవును. కాదు' అన్నది అర్థం కాకుండా తల ఊపాను.

'నచ్చడం లేదా?' అంది.

'ఇది తప్ప మాటాడేందుకేం లేదా! అన్నట్టు

చూసి 'నేను వెళ్తాను' అని లేచాను.

****

కాలగమనంలో మరో మూడు సంవత్సరాలు దొర్లినయి.

ఎండలు.

ఇంటికి చేరాను. శెలవులనగానే.

అమ్మ ఆరోగ్యం 'తేడా'గ అనిపించింది. లోగడ లేదు.

గడప దాటానో లేదో 'ఏరా! ఈ ఏడాదయిన కోడల్ని తెస్తావా' అంది.

'అమ్మా! కోడలు వచ్చినా నా వెంట వచ్చేదేగదనే. దాని రాక వల్ల నీకు అదనంగా ఒరిగేదేముంది?' అని నవ్వాను.

'నాకోసమట్రా నిన్ను పెళ్ళాడమనేది! నీ వయస్సెంతో గుర్తుందా! ముప్పై మూడు' చూద్దాంలేవే. ఆ ఘడియవస్తే ఆగుతుందా అనుకుంటూ వీధిలోకి నడిచాను.

పార్వతి ఇంటి ముందు ఆగాను. పార్వతి గడవన కూర్చుని వసిదానికి పాలిస్తూ కనిపించింది.

నన్ను గమనించి 'రమ్మని పిలిచి. పైట సరి చేసుకుంటూ ఎప్పుడొచ్చావు?' అంది కూర్చునేందుకు చోటు చూపింది.

'ఇప్పుడే, సంచీ పడేసి ఇట్టా బయలుదేరాను'.

'అమ్మకు తగ్గింది. తిరుగాడుతానే ఉన్నది' అని 'నిన్నో ఇంటివానిగ చూడాలని ఆవిడ కోరిక. నువ్వేమో తీర్చేట్టు కనిపించడం లేదు' అని నవ్వింది.

నేను లేవబోయాను.

'ఆగు ! విసిగించను. కానీ బెండకాయ ముదిరితే పశువులు కూడా సరిగ్గా ముట్టవు. అని 'ఏడాది దాటినా ఇది పాలుమరవదు' అని పిల్లను ఎడం చేసి వెల్లకితలా వేసి ఉంచిన మంచంపై నుంచింది. నిద్ర కొరిగినట్లుంది ఏడవ లేదు. పిల్ల చందమామలా ఉంది. పార్వతివైపు చూసి మంచి ఇల్లాలు కళ ఉంది' అనుకొని 'బావున్నావా?' అనడిగాను నాధోరణిలో.

'ఎదురుగనే ఉన్నాను, దాక్కోలేదు గదా' అంది పెద్దగ నవ్వి లోనికెళ్తూ.

బాగు ఒక్క శరీరానికే గాదు. మొదట మనస్సు బావుండాలి. కానీ ఈ ఆడాళ్ళకు మనస్సనేది ఉంటుందా! ఉన్నా దాన్ని మీరుంచుతారా, ఉండనిస్తారా? అన్నట్టుగా చూసింది.

'కాఫీ త్రాగి వెళ్దావు గాని' అంది రెవిక సరిచేసుకుంటూ.

'మీ ఆయనేడి? ఎప్పుడొచ్చినా కనిపించడేం?" అన్నాడు లేస్తూ.

'లేడు. టీకాల 'క్యాంపు' ఉందట. పొరుగూరు వెళ్లాడు. ఆయన ఉద్యోగం తీరది' అంది నవ్వుతూ.

నేను నడిచాను.

'కాఫీ తెస్తానని చెప్పాను గదా! ఏమిటా పరుగు?'

ఆగాను.

'మనకు 'ఆత్మ' అనేది ఉందో లేదో నాకు తెలీదు. శరీరం మాత్రం ఉంది. దీనికి చానా అక్కరలున్నట్టు అవి తీర్చుకొంటూ పోవడమే దీనికి తెల్సిన ధర్మం' అంది.

'ఆ ధర్మం ప్రకారమే అయితే. ఆడాళ్ళు పెళ్ళినాడు మాత్రమే పుడతారు. మగాడి అండన ఆడవారవుతారు. తరువాత అమ్మ, అమ్మమ్మ. మధ్యన మగడు చస్తే - అండ పోయి బ్రతుకు ముగింపుకు దగ్గరవుతుంది. ఆనక ఆవిడా పోతది. నాకు తెల్సిన వరకు ఆడది కనేందుకు పనికొచ్చే ఒక ఉపకరణం' అన్నాను కసిగ.

నన్ను అదోలా చూసింది. ఆ చూపు కొత్తరకంగా ఉంది.

ఆలోచనలో పడింది.

మనిషి అందమైందయినా, మనస్సు వికలమవడంతో అదోలాగయింది. అప్పుడు పార్వతి కళ్ళలోకి చూసాను ధైర్యంగా కానీ ఆవిడ నన్ను చూడడం లేదు.

అసలు పార్వతి ఎవరినైనా మనస్సులో ప్రేమించిందా?

ప్రేమ భావన పొడసూపక ముందే పెళ్ళయి సంసారాన పడిందా?

సంతానం కూడా కల్గిందిగదా!

ఈ సంసారంలో ఏవైనా ఆటు పోట్లున్నాయా!

అసలు 'తన' గురించి అక్షరం ఎప్పుడూ చెప్పదేం?

ఇలా ఆలోచిస్తూ బయటకొచ్చాను.

తలనిండా ఆలోచనలు.

****

నాకు సూర్యుణ్ణి పొద్దుగూకేటప్పుడు చూడడం చాలా యిష్టం. అలాగే పున్నమినాటి చంద్రుణ్ణి.

ఎన్నిసార్లు చూసానో లెఖ్ఖలేదు. బ్రతుకు ఉన్నంతకాలం. అవకాశం దొరికినప్పుడల్లా చూడాలనే కోరుకుంటాను. 'అలా చూస్తూనే. కనుమూస్తే బాగు' అని కూడా అనేకసార్లు అనిపించింది. ఎలా పోతానో, ఉండి చూసిన వాళ్ళకు గదా తెలిసేది?

మరో నాలుగేళ్ళు గడిచినాయి. నేను నలభైలోకి దాదాపొచ్చాను.

పార్వతికి మరో సంతానం కలిగింది.

ఎట్టాగూ ఊరికి వెళ్ళాను గనుక పార్వతిని పలకరిద్దామనిపించి. ఇంటికెళ్ళాను పశువుల్ని కట్టేస్తూ కనిపించింది. మట్టినున్నా మాణిక్యంలా.

నన్ను చూసి... 'రా' ఎప్పుడొచ్చావు. శెలవులా! అనడిగింది చెదరని చిరునవ్వుతో దగ్గరకొచ్చి కూర్చునేందుకు మంచం చూపింది.

నే కూర్చుంటుంటే నెరసిపోతున్న నా తలను గమనించి నవ్వింది.

'ఒక్క కావలోకనమే కాదు అనుభవమూ కావాలి' అంది.

పార్వతి ఈ మాట ఎందుకన్నదో నేను గమనించలేదు. అదోలా చూశాను.

'అట్టా చూడకు. ఈ సృష్టిక్రమాన, దాస్యం చేయడం సబబు కాకపోయినా చేయడం మాత్రం నిజం. చేస్తున్నదీ అదే. కాకుంటే మనం చేసే దాన్ని దాస్యంగా భావించం' అని నవ్వి 'ఇదిగో 'సంసారం' దాస్యమని నాకు ఇప్పటికి అర్ధమైంది. ఎదురు తిరగాలనీ చాలాసార్లు అనిపించింది. ఇప్పుడు ఎదురు తిరగను. కళ్ళు చెవులూ మూసుకొని, లోకం తీరున నడుస్తాను అంది నీళ్ళ బిందెను గాబు దగ్గరికి చేరుస్తూ.

'తప్పు అని తెలిసాక-'

'అవును. తెలుసు' అని పెద్దగ నవ్వి అందరూ చేస్తున్నదే కనుక ప్రశ్నలు రావు అని కాదంటావా అన్నట్టు చూసింది.

ఆ చూపున అమాయకత లేదు. తెల్సుకోవాలనీ లేదు. మనం వట్టి ప్రేక్షకులం' అన్నది కనిపించింది.

ఉలిక్కి పడ్డట్టుగా లేచాను.

లేచి పార్వతి కళ్ళలోకి సూటిగా చూసాను.

పార్వతి ఎటో చూస్తున్నది.

అకస్మాత్తుగా లేచి నన్ను కూర్చోమని చెప్పి 'కాఫీ తాగి వెళ్దువు గాని అంది.

నాకు కొంచెం జంకు అనిపించింది. పార్వతిని చూడాలంటే.

వినిపించుకొనకుండా బయటకొచ్చాను.

****

నేను ఉద్యోగాన ఉన్నచోటికి 'అమ్మ' వచ్చింది.

'చూసిపోదామనిపించి వచ్చానురా' అంది.

## భావనా కిరణం

నిర్మలంగా నవ్వడమే నాకు తెలుసు
మర్మమైన బ్రతుకులోని దుఃఖం
మాటిమాటికీ పీడిస్తుంది.
ఏటివలె కన్నీటిని కురిపిస్తుంది.
పారదర్శకత ప్రతిబింబించదు.
ప్రతిదినం తానే ఒక బింబమౌతుంది.
బింబాన్ని ఎదలో నింపుకొన్న నేను
ప్రతిబింబానికి జోడును కాను.
నన్ను నన్నుగానే చూడమంటాను
మిన్నులో వెలిగే చందమామలా!
ఏడుపు చీకట్లలో మగ్గుతున్న వాళ్లు
ఎంతసేపూ నీడల్నే అనుసరిస్తారు.
అంతరంగానికే మసిపూస్తారు.
అసత్యాల కావ్యాలు రాస్తారు.
అసంభావ్యాల కోసం చూస్తారు.
బింబంలో పుట్టే కిరణం ఎప్పుడూ ఆగదు.
విశ్వమంతా తిరిగినా దాని ఉనికి దాగదు.
భావనారోచిర్మండంలోనే దాని ప్రభావం!
ఏ వర్ణనకూ అందదు దాని విభవం!!

*-డా. అయాచితం నటేశ్వరశర్మ*

'చాలా సంతోషమనిపించింది. ఎప్పుడు అలా బయలుదేరే మనిషి కాదు.

ఏమైనా చెబుతుందేమోనని చూసాను".

మనస్సున ఏమి ఉంచుకొని వచ్చిందో అర్థం కాలేదు. రాగానే వంట డ్యూటీ తీసుకున్నది. అవీ ఇవీ చేసి పెట్టింది.

ఆవిడ మోకాళ్ళపై తల ఆన్చి కూర్చుని ఆవిడ చెప్పింది వింటూ.

చాలా సేపు గడిపాను.

అయిదో నాడు నేను లేచినా – అమ్మ అలికిడి వినిపించలేదు 'ఇంకా లేవలేదా?' అనుకుంటూ మంచం దగ్గరకు వెళ్ళాను. పడుకునే ఉన్నది. జ్వరంగానీ తగిలిందేమోనను కొని 'అమ్మా' అంటూ నుదుటిపై చేయుంచాను. చలికట్టె పడి ఉన్నది. తట్టి లేప ప్రయత్నించాను. ప్చ్. ఏ రాత్రో ఉపిరిపోయినట్టుంది. కట్టెలాగుంది. 'అమ్మా' అంటూ ఆవిడపై పడి ఏడ్చాను. సొక్కిందాకా ఏడ్చి లేచాను. అప్పటికి ఇంటి చుట్టు పక్కల వాళ్ళు, నాతో పనిచేసే పంతుళ్ళు చేరారు. ఓదార్చారు. కర్మకాండ అక్కడే పూర్తి చేశాను. పార్వతికి కబురు చేశాను. మా ఇంటిని ఎవరికైనా అద్దెకివ్వమని, ఇంట్లో ఉన్న సామాను సర్ది భద్రపరచమనీ.

వేసవి సెలవలదాకా ఎటూ కదలలేదు.

అమ్మ జ్ఞాపకాలు వదలనూ లేదు.

'పెళ్ళి చేసుకోరా' అన్న అమ్మ మాట తీర్చనూ లేకపోయాను.

శెలవలకు మా ఊరెళ్ళాను. ఇంటికి తాళం వేసి ఉన్నది.

తాళం చెవికోసం పార్వతి దగ్గరకెళ్ళాను.

గడప ముందాగాను. ఇంటి ముందు కంచెన పూల మొక్కలు కనిపించినయి. పూలు వాటినంటిపెట్టుకొని చీడపురుగులూ అన్నీ అందంగానే ఉన్నవి. పార్వతి కోసం పార జూచాను. కనిపించలేదు.

'అందాల్ని అందరం తినడమేమిటి?' అనిపించింది పూలను చూస్తుంటే.

పులి అందంగానే ఉంటుంది. 'లేడీ'ను

లేడిని వేటాడి మరీ తింటుంది ఆకలయినప్పుడు.

ఒకటి మరొకదానికి ఆహారమన్నమాట. అదెలాటిదైనా.

అంటే ఇక్కడ జీవరాశికి. అందమూ అనాకారితనమూ ముఖ్యం కాదు.

ముఖ్యమైందా 'ఆకలి'.

ఈ 'ఆకలి' దేన్నీ మిగలనీయదు.

దాట్ల కరువప్పుడు – మనిషిని రేగడి మట్టి ముద్దలను మజ్జిగన ముంచుకు తినేలా చేసింది అనుకుంటుండగా – పార్వతి తోవ నుంచి లోనికొస్తూ కనిపించింది. నన్ను చూసి ఆగింది. ఆవిడ కండ్లలో ఉంది. మా అమ్మ గుర్తులోకొచ్చి ఉండొచ్చు. 'చాలా మొక్కలు వేసావు. బావున్నయి' అన్నాను ఆవిడ చూపుల్నుంచి తప్పుకుంటూ. 'ఇప్పుడే వచ్చావా?' అన్నట్టు చూస్తూ నడిచింది.

పార్వతి వెంట ఆరో తరగతి పుస్తకాలతో ఓ పసిది ఉన్నది. పార్వతంత ఇదిగా లేకున్నా పార్వతి బిడ్డే. ఒకసారి పాలు చీకుతూ కనిపించిన పిల్ల ఇదేనేమో?" అనుకుంటుండగా.

'పాప! పెద్దది' అంది దాని తలపై చేయి ఉంచి. అయిదారేళ్ళలో ఇదీ పెద్దదవుతుంది. దీనికో లింగణ్ణి వెతకాలి. దానికేమీ తెలీకున్నా వాడితో మూడు ముళ్ళేయించాలి. వానెంట సంతగొడ్డులా పంపాలి అంది నవ్వుతూ. ఆ నవ్వున నాకు మొత్తం ఆడాళ్ళ బాధ కనిపించింది. ఎంతో అలవోకనో అన్నదా మాటలు.

'పార్వతికి ఆలోచన ఉన్నది' అని మొదటిసారి అనుకున్నాను.

నా పిచ్చిగాని ఆలోచన లేని మనుషులుంటారా?

పార్వతిని గురించి నేనేదో కొత్తగా కనిపెట్టినట్టు ఇవ్వాళ్ళ అనుకొనడమేంటి?

అర్థం కాలేదు.

'ఇక పెళ్ళి జంఝాటన పడకు' అంది నన్ను చూస్తూ.

లోనికెళ్ళి తాళం చెవి తెచ్చి చేతికిచ్చింది.

తీసుకున్నాను.

'ఇదిగో! ఉద్యోగం పురుష లక్షణం అన్నారు. పెళ్ళాడడం ఫలానా లక్షణం అని చెప్పలేదు. చెపితేగిపితే 'పరుష లక్షణం' అనాలి' అంది

అదోలా పిల్ల దానేపు చూస్తూ.

'పార్వతేనా!' అనిపించింది. నన్ను సముదాయించేందుకు మాట్లాడడం లేదు గదా! అనీ అనిపించింది.

మనిషి, మనసు లోతైంది. అంత త్వరగా అర్థం కాదు. పార్వతివైపు చూద్దామన్నా అదోలా అనిపించింది.

'మనది మరీ చిత్రమైన సాంప్రదాయం. మగణ్ణి కొనుక్కొని మరీ - వానికి బానిసగా మారడం' అని పెద్దగా నవ్వింది.

ఈ సృష్టిన భగవంతుడే భక్తునికి దాసుడట. మేం దాస్యం చేయడంలో వింతేముంది? అంది.

నాకు ఇక అక్కడ ఉండాలనిపించలేదు.

పార్వతి చాలా అమాయకంగా కనిపిస్తది. మరి ఈ ఆలోచనలు?

పెద్ద చదవరి కాదు. ఎప్పుడూ ఇంటెడు చాకిరి - మరి?

'నాకు మంచినీళ్ళిచ్చింది.

ఆగాను. ఇచ్చిన నీళ్ళను త్రాగాను.

'నువ్వు ఉద్యోగం పేరిట చేస్తున్నదేమిటి?' అనడిగింది.

'నౌకరి'

'కాదు. గౌరవనీయమైన బానిసతనం.' అని కాదంటావా? అన్నట్టు చూసి.

'అక్కడ స్వతంత్రించి నువ్వు ఏదైనా చేయగలవా?' అంది నవ్వి.

చెయ్యలేవు. మరి వదలక నౌకరీ చేస్తూనే ఉన్నావు గదా! ఆ దాస్యం అంతా బాగుందా! అందులో ప్రేమ గట్రా కూడా ఉన్నాయా?' అని నవ్వుతూ చూసి - మనకున్న ప్రేమ దాస్యాన్ని సహిస్తుంది. భరిస్తుంది. నాకు తెల్సిన మటుకు ఈ సృష్టి పరిదిన పుట్టడమే దాస్యం అని ఆగి 'కాదనలేం - 'నిజం' గనుక - అని నీకో విషయం తెలుసా?

అమాయకుడికి స్వేచ్ఛా కష్టమే. అతనికది నష్టం చేస్తది.

విలువ ఎరిగిన వానికి స్వేచ్ఛ లేకుండడం నష్టం. కష్టం.

సమాజానికీ - మంచిది కాదు. ఇంతెందుకు మన శరీరాన్నే చూడు, ఇది వయస్సుకు దాస్యం చేస్తుంది. కాలగమనాన దేనితోవ దానిదే.

ఏమీ మిగలదు. కాదంటావా? అంది.

ఎటూ నిల్చున్నాను. ఏం చెప్పాలో తెలీలేదు.

* * * *

మరో మూడేళ్ళు గడచినయి.

నేను మా ఊరికి అంతగా వెళ్లడం లేదు. పార్వతి పెద్ద పిల్ల 'పెళ్లి'కి కబురొచ్చింది. పోలేదు. పార్వతి చావుబ్రతుకుల్లో ఉందని కబురొస్తే వెళ్ళాను.

చిన్నది ఇంటి దగ్గర కూర్చుని చదువుకుంటున్నది.

నా రాకను గమనించి దగ్గరకొచ్చింది. నా ఇంటి తాళం చెవి ఇచ్చింది.

'అమ్మ' ఎక్కడ?' అడిగాను.

ఆసుపత్రిలో ఉందని చెప్పింది.

నన్ను 'అమ్మ' దగ్గరకు తీసుకెళ్ళింది.

నిండుకుండలా ఉండే పార్వతి చెదరి కనిపించింది.

పార్వతిన మార్పు నేనెన్నడూ వూహించలా-

మన వూహలు అనేకం-సరికావని పార్వతి కనిపించాక అర్థమయింది.

అంతులేని బాధ- గుండె నులిమింది. కన్నీరుబికింది. మాట మూగబోయింది

దగ్గరకెళ్ళాను.

మంచానికి దగ్గరగా కూర్చున్నా. కళ్ళు తెరవలేదు. బాధలోనే కొట్టుమిట్టాడుతున్నది.

'పార్వతీ' - అని పిలిచాను కళ్ళు శుభ్రంగా తుడుచుకొని.

## కు!

ఒక రంగుల కలతో
కలబోతగా మరో కల
కలాం చెప్పినట్లు
సాకార ప్రక్రియ కోసం
కలలోంచి బైటకొచ్చి
కష్టపడ్డం ఆరంభించేను!
కల హాయినిచ్చింది!!

-విజయశ్రీ జి

నెమ్మదిగా కళ్ళు తెరిచింది.

నన్ను చూసింది.

ప్రశాంతంగా నవ్వింది. శరీరపు బాధ నధిగమించి కూర్చునే ప్రయత్నం చేసింది. వారించాను.

నా రాక ఆవిడలో ఎంతో కొంత ధైర్యాన్నిస్తుందన్న నమ్మకం నాకుంది.

'ఏమయింది?' అడిగాను.

'శరీరాలు గదా' అంది నవ్వి.

ఎంత స్వచ్ఛత ఉందా నవ్వున.

ఆవిడనే చూస్తున్నాను.

ఇవి మనకు సహజమైనవి. అసహజమైతే ఏదో ఒకటి చెబుదును అన్నట్టుగ చూసింది. కళ్ళలో కాంతి లోపించినట్టుగా అనిపించి నా కళ్ళలో నీరు నిండింది.

'నీ జబ్బుకు ఏదో పేరు చెపుతారు గదా!'

'జబ్బే! వైద్యులు చూసి చెప్పారు. వైద్యం చేస్తున్నారు. త్వరలో నయమవుతుందని చెప్పారు. వారి పరిజ్ఞానం చెప్పే సంగతి గదా వారు చెప్త.

పార్వతీ వాళ్ళ అమ్మకోసం చూశాను. కనిపించలేదు. వాళ్ళ అండనైనా ఉండాలి గదా! అనిపించింది. నన్ను ఇక్కడదాక తీసుకొచ్చిన పిల్లదీ వెళ్ళి పోయినట్లుంది. కనిపించలేదు. నర్సు వచ్చి ఓ సూది వేసి వెళ్ళిపోయింది.

ధైర్యంగా పార్వతి చేతిని పట్టుకొని ఏడ్చాను.

అసలు నేనెవరు పార్వతి దగ్గర ఏడ్చేందుకు?

'ఏమిటీ! ఏడుస్తున్నావా?' అన్నట్టు చూసింది.

బలిమిన ఆపుకున్నాను.

శక్తిని కూడదీసుకుని నెమ్మదిన లేచి కూచుంది. నా చేతిని గట్టిగా పట్టుకుంది.

'అసలు నువ్వు పెళ్ళి ఎందుకు చేసుకోలేదు?' అడిగింది నా కళ్ళలోకి చూస్తూ.

భయంగా చూసాను.

'నేను చెప్పనా!' అంది.

'నేను చెప్పాల్సిన కారణం గదా! ఊహించి చెపుతావా?' అన్నాను.

'కాదు. నిజం చెప్తాను.'...

'నిజమా 'నాకు అర్థంగాని నిజం' నవ్వుకున్నాను.

'నాకు ముందు పెళ్ళయిందనే గదూ' అంది.

పిడుగు పడ్డట్టయింది. ఉలిక్కిపడ్డాను.

గుండె పగిలేలా ఏడవాలనిపించింది. 'ఇది నిజమా?' అని అనిపించింది.

తలంతా పోటు, పిచ్చి లేచినట్టుగా లేచాను.

బాధ ఆగక ఎగతడుతున్నది.

ఆగని కన్నీటిని - నిలువరించి - తుడుచుకున్నాను.

తుడుచుకుంటూనే పార్వతివైపు తిరిగాను.

మొఖాన నవ్వు పులుముకునే ప్రయత్నమూ చేసాను.

నన్నే చూస్తున్నది పార్వతి.

నేనిటుమళ్ళగానే 'కూర్చో' మన్నట్టు సైగ చేసింది.

కూర్చున్నాను.

ఆమె కళ్ళలోకి చూడలేకపోయాను. నెమ్మదిగా పార్వతి రెండు చేతులనూ నా చేతుల్లోకి తీసుకొని 'పార్వతి! నువ్వు బ్రతకాలిరా, బ్రతుకుతావు' అన్నాను. వసివానిలా భుజంతో కళ్ళు తుడుచుకున్నాను.

ఏమిటీ ఆత్మీయత?

ఇప్పటిదాకా ఎక్కడ దాగింది?

ఇన్ని రోజులేం చేస్తున్నాను?

ఎదురుగా ఉన్నా మనస్సును గమనించలేక పోయానేం?

అంతా అయోమయం.

దరీదాపు దొరకని మానసిక స్థితి.

ఆగని అలజడి.

నవ్వింది.

బెదిరిస్తున్నట్టుగా నవ్వే నవ్వది. దాని నిండా ఒగరు, పొగరు చిలిపిదనం కొంత కోపం...

కన్నులు పట్టనంత అనుభూతినిచ్చే నవ్వు అది.

రెప్పవాల్చక చూస్తుండి పోయాను.

చూస్తూనే ఉన్నాను.

నే చూస్తుండగనే నవ్వుతూనే చలన రహితమైంది.

సృష్టి క్రమ పరిధిన వదిగింది.

నా చేతనున్న పార్వతి చేతులు, అలాగే బిగుసుకుంటున్నాయి. నేనేమయ్యానో నాకే తెలీదు.

పార్వతీ - పార్వతీ అన్న పిలుపు గుండె గొంతుకనే ఆగింది.

చేతనా చేతనాన్ని గమనించే శక్తి నాకూ పోయింది. ■